


# ఇదీ ఒక మార్గమే

వీధిలో "పోస్ట్" అనే కేక వినపడగానే ఆరాటంగా, పడుతూ లేస్తూ పరుగెట్టాను- పోస్ట్‌మ్యాన్ చేతిలోంచి ఉత్తరం ఇంచుమించు లాక్కున్నాను. ఆ దస్తూరీ చూడగానే పోల్చాను. అవును. శంకరమే రాసాడు. వీడు అందరి లాంటి వాడు కాడు-చదువులు నేర్చుకొని ఉద్యోగాల్లో చేరగానే తల్లినీ తండ్రినీ మరిచిపోయే మామూలు మనిషి కాడు వాడు. నా చేతులలో పెరిగిన, నా రక్తం పంచుకుపుట్టిన బిడ్డ— వాడికి లేకి బుద్ధులెలా వస్తాయి?

నేను ఉత్తరం ఇంకా చదువుతూండగానే హాల్లో మంచంలో పడుకుని ఆయాస పడుతున్న మావారు "ఎక్కణ్ణించే? శంకర్ రాసాడా? ఈసారైనా మనని రమ్మని రాసాడా? ఈ వయసులో




ఇక్కడ ఈ మారుమూల ఇద్దరమూ ఎన్నాళ్ళని ఉండగలమే!" అంటున్నారు.

ఆయన అలా అడగటం మామూలే! ఉత్తరంలో సంగతులూ మామూలుగానే వున్నాయి. శంకర్ ఎప్పటి పాటే పాడుతున్నాడు-

"ఇక్కడ ఈ ఇల్లు ఏమాత్రం సదుపాయంగా లేదు. మీరు ఇప్పట్లో

రావద్దు. దేవుడి దయవల్ల కొత్త మంచిఇల్లు దొరగ్గానే నేను రాస్తాను. అప్పుడు వద్దురుగాని-ఈ నెల మీకు రెండువందలు పంపగలుగుతున్నాను. అనేక ఖర్చులవల్ల ఇంతకంటే ఎక్కువ పంపలేకపోతున్నాను. మీరు తొందరపడి రావద్దు...."

ఉసూరుమనిపోయింది ప్రాణం. ఉత్తరం అందుకొనేటప్పుడు వున్న ఉత్సాహం చదివాక లేదు. పాపం, ఆయన మరీ కృంగిపోతున్నారు. ఒక్కగానొక్క కొడుకని పువ్వుల్లో పెట్టి పెంచాం! చిన్నప్పటి నుండీ మేకపోతు గాంభీర్యంతో వాడిని మందలించేవారే కాని, ఆయనకు శంకర్ అంటే నన్ను మించిపోయిన ప్రేమ, గారాబం. ఆఫీస్‌నుండి వచ్చేసరికి ఇంట్లో కనబడకపోతే,'శంకర్ ఏడీ? ఎక్కడకు వెళ్ళాడు?" అని పదిసార్లు అడిగేవారు. ఆయన పిచ్చిగానీ వయసొచ్చిన మొగపిల్లలు ఇంట్లో వుంటారా? అదే, సర్ది చెప్పలేక చచ్చేదాన్ని. ఇప్పుడు మరీ ఈ వృద్ధాప్యంలో, అనారోగ్యంలో, కొడుకు దగ్గిరే ఉండాలని ఆయన ప్రాణాలు కొట్టుకుపోతున్నాయి. నాకుమాత్రం? ఇక్కడ మాకే ముందనీ? అక్కడ వాడూఇక్కడ మేమూఎందుకొచ్చిన అవస్థ! ఖర్చుకూడా రెండు సంసారాలకు ఎక్కువకాదూ? "అసలు నువ్వు వాడికేం రాసావు? చిన్న ఇల్లయినా పరవాలేదని రాయకపోయావా? ఎలాగో ఒకలా సర్దుకుంటామని రాసి ఉండవు. వాడు నీకు భయపడే రావద్దంటున్నాడు. అన్నీ శాస్త్రోక్తంగా కావాలంటావు—"

మంచంలో ఆయాసపడుతూ నన్ను కసురుకున్నారు మావారు. అంత దుఃఖంలోనూ నవ్వుకూడా వచ్చింది. ఈ హిందూదేశంలో మొగవాడికి భార్య తప్ప కసురుకోవటానికి మరెవరు దొరుకుతారు? అన్నివిధాల చికాకుల్నీ భార్యమీద చూపించుకోవచ్చు! ఆఫీస్‌లో ఆఫీసర్ తిట్టినా, అప్పుతీసుకున్న వాడు బాకీ తీర్చకపోయినా, కావాలనుకున్నప్పుడు అప్పు దొరక్కపోయినా, ఏది ఎలా జరిగినా ఆ తిక్కనంతా భార్యమీద చూపించుకోవచ్చు!

"నన్నెందుకంటారు? పోనీ మీరే రాయకూడదూ వాడికి?" అన్నాను.

ఆయన నోరు మూత పడింది. మొదటినుండీ అంతే! ఈ తండ్రీ కొడుకు లిద్దరూ ఒకరి నొకరు ఏం అనుకోవలసివచ్చినా నన్నే

అడ్డం పెట్టుకునేవారు. తండ్రి అడిగిన డబ్బు ఇయ్యకపోతే వాడు నా దగ్గిర పేచీలు పెట్టేవాడు. కొడుకు మీద కోపం వస్తే ఆయన నన్ను తిట్టేవారు.

ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కూడా కొడుక్కి నన్నే రాయమంటున్నారు.

నేను రాశాను-ఒకటి కాదు-వంద ఉత్తరాలు। నేను పెద్ద ఇల్లు కావా లనలేదు. సర్దుకోలేనని అసలే చెప్పలేదు. ఎంత చిన్న ఇల్లయినా, చివరకు ఒక్క గది అయినా పర్వాలేదు. అందరం అక్కడే ఉందాం అని ఎన్నో విధాల నచ్చజెబుతూ రాసాను. అయినా వాడు ఎప్పుడూ ఒకటే పాట। నేనేం చెయ్యగలను? వాడు అంత స్పష్టంగా రావద్దని రాసాక కాదు కూడదని ఎలా వెళ్ళటం? ఒక మొట్టికాయ మొట్టి నా ఇష్టం వాడి నెత్తిమీద రుద్దటానికి పసివాడు కాడుగదా। అంత గట్టిగా రావద్దని రాసాక వెళ్తే కోపం వస్తుందేమో।

ఆయన తల చేత్తో గట్టిగా రుద్దుకుంటున్నారు. అంటే తీవ్రంగా ఆలోచిస్తున్నారన్నమాట।

"ఇక ఈ ఉత్తరాలతో లాభం లేదు. పద। మనం వెళ్ళిపోదాం। గుమ్మంలోకి వచ్చినవాళ్ళని పొమ్మనడుకదా। చిరాకుపడితే పడతాడు. ఆ చిరాకులన్నీ అవే సర్దుకుంటాయి" అన్నారు. నాకూ అలాగే అనిపించింది. ఆ మరునాటికే ప్రయాణం నిర్ణయించుకుని అన్నీ సర్దటం మొదలుపెట్టాను. ఏమున్నాయి సర్దటానికి? వృద్ధాప్యంలో వున్న దంపతులం। ఉన్న బట్టలు కొంచెమూ చిన్న ట్రంకు పెట్టెలో సరిపోయాయి. వాడికిష్టమని మినప సున్ని చేసాను. రకరకాల ఊరగాయలు సీసాలలో సర్దాను. అవన్నీ బుట్టలో పెట్టాను. ట్రంకుకంటె ఈ బుట్ట బరువుగా వుంది. కొడుకు దగ్గిరకు ప్రయాణమనగానే వారు లేని ఓపిక తెచ్చుకుని తిరుగుతున్నారు. ఎలాగయితేనేం। సిటీ చేరుకున్నాం। ఆ బస్సులు, కార్లు, ఆ రొద-తల తిరిగిపోతోంది. ప్రతి ఒక్కరూ ఎక్కడో ఏదో కొంపలంటుకుపోతున్నట్లు పరుగులు పెడుతున్నారు. ఎవరి ముఖంలో చూసినా ఏదో అలసట, విసుగు - ఉల్లాసంగా నవ్వుతూ స్థిమితంగా నిలబడగలిగిన ప్రాణి కనపడటమేలేదు, కార్లల్లో తిరిగే వాళ్ళ ముఖాలు ఎలా వుంటాయో। ఆ ముఖాలు మాకు కనపడటం లేదు. మెరుపుల్లా మెరిసి మాయ

షయిపోతున్నాయి.

అలాటి సిటీలో అడ్రస్ ప్రకారము ఇల్లు కనుక్కోవటం ఎంత కష్టమో చెప్పనక్కర్లేదు. చూస్తూ చూస్తూ ఆటోలకి పొయ్యలేక, బస్ రూట్లు కనుక్కోలేక ఎంతో ప్రయాసపడుతూ, ఎలాగో అడ్రస్ ప్రకారం ఇల్లు కనుక్కోగలిగాం. అది పెద్ద కాంపౌండు. ప్రత్యేకించి అద్దెలకియ్యటానికే ఇల్లు కట్టినట్లున్నాడు ఆ గృహ యజమాని. దగ్గిర దగ్గిర పది కుటుంబాల వాళ్ళు అద్దెకున్నట్లున్నారు. ఆక్కడ అన్నీ చిన్న చిన్న వాటాలు....

"ఇక్కడ శంకరం ఉండేది ఏ వాటాలో?" అని ఎవరి నడిగినా చెప్పలేక పోతున్నారు. అంతగా ఒకరి విషయం ఒకరు పట్టించుకోకుండా బ్రతుకుతున్నారన్నమాట!

అంతలో 'ఆంటీ' అనే పిలుపు వినిపించి ఆశ్చర్యంగా చూసాను. ఖరీదైన బట్టల్లో చిరునవ్వు నవ్వుతూ నిలబడ్డ ఆ యువకుణ్ని వెంటనే గుర్తు పట్టలేకపోయాను. కాస్త పరీక్షగా చూసేసరికి గుర్తొచ్చింది! రాజయ్య! అతని పూర్తి పేరు రాజారావు. అందరూ రాజయ్య అని పిలిచేవారు. మా శంకర్ క్లాస్‌మేట్. ఏదో క్లాస్ చదువుతుండగానే అతడు సకల కళ్యాణ గుణాభి రాముడిగా ప్రసిద్ధికెక్కాడు. సిగరెట్లు, పేక- ఒక టేమిటి? అతడి ముఖం చూస్తేనే నాకు అసహ్యం. ఆ రోజుల్లో ఈ రాజయ్యతో శంకరం స్నేహం మాన్పించలేక నానా యాతనా పడ్డాను. నాకు బాగా గుర్తు. ఒక రోజు నాకు తెలియకుండా రహస్యంగా బడి ఎగ్గొట్టి రాజయ్యతో మార్నింగ్ షోకి వెళ్ళాడని శంకరాన్ని చెంప వాయగొట్టాను. వాడి మీద చెయ్యి చేసుకున్నందుకు తరువాత చాలా బాధపడ్డాను. రాజయ్య ఏదో క్లాసు నాలుగుసార్లు ఫెయిలయ్యాడు. ఆ తరువాత శంకర్‌కీ రాజయ్యకీ దూరం పెరగటంతో రాజయ్య మా యింటికి రావటం మానేశాడు. అతణ్ణి గురించి ఆ తరువాత నాకేమీ తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నించనూ లేదు. ఆనాటి కీనాడు దొరబాబులా నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

"గుర్తుపట్టలేదా ఆంటీ! నేను రాజాని!" అన్నాడు నవ్వుతూ. ఆ నవ్వులో గర్వం తొంగి చూస్తోందా? ఏమో! మన మనసులో ఊహల్ని బట్టి కొన్నిసార్లు లేనివి కూడా కనిపిస్తాయి.

"ఎందుకు గుర్తు పట్టలేదూ? బాగున్నావా?" మామూలుగా పలక

రించాను.

"ఏదో ఉన్నాను ఇలా...." ఈసారి ఒక విధమైన పెకూ్క. గర్వమూ స్పష్టంగా కనిపించాయి.

"మా శంకర్ ఇదే కాంపౌండ్‌లో ఉన్నాడట! నీకు తెలుసా?"

"ఆ! తెలుసు! అదిగో! ఆ వాటాలో...." కూలిపోతున్న ఒకే ఒక్క గది- అది తాళం పెట్టి ఉంది.

"ఎక్కడికెళ్ళాడో! డ్యూటీకి వెళ్ళాడేమో! ఎప్పుడొస్తాడు రాజయ్యా!" తాళంకేసి నిరాశగా చూస్తూ ఆరాటంగా,అమాయకంగా అడిగారు మావారు.

మావారు'రాజయ్యా'అని పిలిచినందుకు ఈనాడు రాజాగా మారిన రాజారావుకి కోపం వచ్చినట్లు అతని ముఖమే చెప్తోంది. అందుకని నేను సర్దేస్తూ—

"చూసావా? మీ అంకుల్ ఇంకా నిన్ను చిన్ననాటి రాజయ్యగానే చూస్తున్నారు. అంతే! మా పెద్దవాళ్ళ కళ్ళకి మీరు ఎంత పెద్దయినా పసిపిల్లల్లాగే కనిపిస్తారు" అన్నాను.

దాంతో రాజయ్య ముఖం కాస్త వికసించింది. ఇతణ్ణి ఇచ్చకాలాడుకోవలసిన కర్మ ఎంతసేపోనని మనసులో విసుక్కుంటూ "మా శంకర్ ఎప్పుడొస్తాడో నీకు తెలుసా?" అన్నాను.

రాజయ్య అదోక మాదిరిగా నవ్వి "మా ఇంటికి రండి. చెప్తాను" అన్నాడు.

నా మనసు ఏదో అపస్వరాలు పలికింది ఆ నవ్వు చూస్తోంటే. అయినా అనారోగ్యంతో బాధ పడుతున్న మా వారిని మరింత శ్రమపెట్టలేక రాజయ్యతో అతని ఇంటికి వెళ్ళాము.

రాజయ్య ఇల్లు బాగుంది. మూడు గదులున్నాయి. నీట్‌గా ఉంది. అతని ఇంటితో మా శంకర్ వాటాని పోల్చుకోకుండా ఉండలేక పోయాను.

వెధవ మనసు!

లోలోపల ఈర్ష్య బుస కొట్టక పోలేదు. లోపలినుంచి "ఎవరూ" అంటూ వచ్చింది రాజయ్య తల్లి వరాలు. ఆవిడ పేరు వరలక్ష్మి. మేమంతా—

"వరాలూ!" అని పిలిచేవాళ్ళం. చక్కని గుంటూరు నేతచీర కట్టుకుని శుభ్రంగా ఉంది వరాలు. మొగుడు తాగుబోతై ఇంటి విషయం పట్టించుకోదనీ, కొడుకు ఎందుకూ పనికిరాని రౌడీగా తయారవుతున్నాడనీ, నా దగ్గిర ఏడ్చిన వరాలుకి నా పాతచీరలు ఒకటి

రెండిచ్చినట్లు బాగా జ్ఞాపకం- అవి అందుకుంటూ "వెధవ బ్రతుకు" అని కన్నీళ్ళు పెట్టుకున్న వరాల్ని చూసి నేను బాధపడ్డాను. వరాలు చీరతో నా చీర పోల్చుకుని లోలోపల సిగ్గు పడ్డాను—

"అరే! లక్ష్మీదేవిగారూ, రండి! రండి! ఎంత అదృష్టం! సాక్షాత్తు లక్ష్మీదేవే నా ఇంటికి వచ్చినట్లుగా ఉంది—" అని సాదరంగా ఆహ్వానించింది వరాలు.

"అన్నయ్యగారి ఆరోగ్యం బాగా పాడయినట్లుంది...." అని సానుభూతి చూపింది.

వరాలు అతిధ్యాన్ని ఆ పూటకి మేం అంగీకరించక తప్పలేదు. అంతకంటే దారి లేదు. అడుగడుగునా వరాలు తన గొప్ప ప్రదర్శిస్తోనే ఉంది.

"ఇదిగో ఈ ప్రెషర్ కుక్కర్ మొన్ననే కొన్నాను. వెధవది. బట్టలు ఉతుక్కోవాలంటే చాలా యాతనగా ఉంది. వాషింగ్ మిషనే కొనేవాడే మావాడు. ఫ్రిజ్ కొంటానంటున్నాడు. ఇవాళో, రేపో కొనేస్తాడు—"

ఈ ధోరణిలోనే సాగుతున్నాయి, ఆవిడ మాటలన్నీ. స్నానం చేసి భోజనం చేసాక "నువ్వేం చేస్తున్నావు రాజా! అని అడిగాను ఆదరంగా—

"నేను "రాజా" అని పిలిచినందుకు అతడు చాలా పొంగిపోయాడు.

"యస్ అండ్ యస్ కంపెనీకి ప్రొప్రైటర్ని" అన్నాడు గొప్పగా—

మా వారు ఆశ్చర్యంగా చూసాడు- నాకూ ఆశ్చర్యం కలిగింది- "ఏం చదువుకున్నావు?" అన్నాను మెప్పుదలగా, రాజయ్య కొంచం తడబడి అంతలో సర్దుకుని "వెధవ ఉద్యోగం! క్షణం తీరుబడి ఉండదు." అన్నాడు- నేను అడిగిన దానికీ, అతడు చెప్పినదానికీ సంబంధంలేదు.

అతడి యింటికి అతిధిగా వచ్చి అతణ్ణి నొప్పించటం ఇష్టంలేక చదువు సంగతి మళ్ళీ అడగలేదు నేను. అతడా విషయం దాటేస్తున్నాడని అర్థమవుతోనే ఉంది.

"మా శంకర్ ఎప్పుడువస్తాడు నీకు తెలుసునా?" అని అడిగారు మావారు. పాపం. ఆయన ప్రాణాలన్నీ కొడుకుకోసం అల్లాడుతున్నాయి.

రాజయ్య ఇబ్బంది పడుతున్న ట్లుగా మొహం పెట్టి "చెప్పలేను. రెండు మూడురోజులు పడుతుం దేమో!" అన్నాడు.

"ఎందుకని?" ఇద్దరమూ ఒకే సారి ఆరాటంగా అడిగాము.

"శంకర్ హాస్పిటల్ లో ఉన్నాడు—"

"ఆ!" అన్నారు మావారు గాబరాగానే-నా నోటినుండి ఆమాట కూడా రాలేదు. పిచ్చిదానిలా చూసాను.

"కంగారు పడకండి! శంకర్ కేం కాలేదు. ఒక స్నేహితుడికి దెబ్బలు తగిలితే హాస్పిటల్‌లో చేర్పించి తనూ అక్కడే ఉన్నా డనుకుంటా—"

మా గాబరా చూపి త్వరగా చెప్పాడు రాజయ్య- మేం కాస్త తేరుకున్నాం- అయినా వెంటనే శంకర్‌ని చూడాలని మా మనసులు ఆరాట పడుతున్నాయి.

"శంకర్ ఏ హాస్పిటల్‌లో ఉన్నాడు? చెప్పు వెళ్తాం?" అన్నారు మావారు.

"నాకు తెలియదు. ఇలాంటి వివరాలు వాళ్ళెవరికీ చెప్పరు—"

"అదేమిటీ?"

"అతడొక గూండా! గోడల నిండా పిచ్చి పిచ్చి రాతలు రాస్తోంటే పోలీసులు! లాఠీలతో, కొట్టారు. శంకర్ రహస్యంగా హాస్పిటల్లో చేర్పించాడు. హాస్పిటల్ లో కాదేమో! వాళ్ళలో ఒక డాక్టర్ కూడా ఉన్నాడు. అతని దగ్గరకు తీసుకెళ్ళారేమో! నాకు సరిగ్గా తెలియదు!"

మాకిద్దరికీ ఊపిరి ఆగిపోయి నట్లయింది.

"మా శంకర్ గూండాలతో తిరుగుతున్నాడా?" నమ్మలేనట్లు అడిగారు మావారు. రాజయ్య సమాధానం చెప్పలేనట్లు తల వంచుకున్నాడు. వంగిన అతని ముఖంలో పెదవులు మాత్రం ముసిముసి నవ్వులు నవ్వు తున్నాయి. పైకి బాధపడుతున్నట్లు నటిస్తూ ఇదంతా మాకు చెప్పగలిగి నందుకు అతడు చాలా ఆనందిస్తు న్నాడని అర్థమయింది నాకు.

"చిన్నప్పుడు నేను రౌడీనని నన్ను తిట్టేవారు ఇప్పుడేమం టారు?" అన్నట్లు గర్వంగా ఉన్నాయి అతని చూపులు.

మనసు ఎంత చికాగ్గా వున్నా. ఒకటి రెండు రోజులు అక్కడే వుండాలి మేము.

ఆ రాత్రంతా మా ఇద్దరికీ నిద్ర పట్టలేదు. ఆ మరునాడు రాజయ్య ఇంటిముందు వరండాలో దిగాలుగా

క ర్చున్నాము. పచ్చిమిరపకాయ బజ్జీలు అమ్మేవాడు బండి తోసు కుంటూ లోపలికి వస్తున్నాడు. ఇక్కడ కాంపౌండ్ లోపలికి కూడా వచ్చి అమ్ముతారా?

"ఏయ్" అంటూ అతణ్ని పిలవ బోయిననేను ఎదురుగా దెయ్యాన్ని చూసినట్లు ఆగిపోయాను. ఆ బండి తోసుకుని వస్తున్నది శంకర్! నన్ను చూసి శంకర్ కూడా బండి వదిలి అలాగే నిలబడిపోయాడు. ఇంతలో మావారు కూడా బయటికి వచ్చి "శంకర్!" అని ఒక్కగావుకేక పెట్టారు. శంకర్ తల దించు కున్నాడు. వరాలు మావారి కేకకు లోపలినుంచి వచ్చి "నేను ముందే చెప్పుదామనుకున్నాను. మీరు బాధ పడతారని చెప్పలేకపోయాను" అంది. వరాలు మాటలలో ఒలి కించిన సానుభూతి వికసించిన ఆవిడ ముఖంలో ఏ కోశానా లేదు. నేను మావారి చెయ్యి పట్టుకుని "రండి" అంటూ నడిపించుకు వెళ్లాను. ఇంచుమించు ఏడాదిగా కొడుకును చూడాలని కలవరిస్తూ కొడుకుని ఉద్యోగస్థుడి హోదాలో చూస్తానని కలలు కంటూ చివరికి ఈ స్థితిలో చూడవలసివచ్చిన ఆ తండ్రి క్షోభ నే నర్థం చేసుకో గలను. ఇందుకే వాడు మమ్మల్ని రావద్దని రాసింది. ఈ రకంగా కష్టపడి పంపుతున్నాడా మాకు నెల నెలా ఆ డబ్బు!? బాధతో నా మనసు మెలితిరిగి పోయింది. జాలితో నా కడుపు తరుక్కు పోయింది. శంకర్ ఏం మాట్లాడ కుండా తలుపు తీసాడు. ఒక్క గది- చాపా, పరుపుచుట్టా తప్ప సామానులు ఏం లేవు. ఒక వారకి కూజా, గ్లాసు ఉన్నాయి. చిన్న కిరసనాయిలు స్టౌ, టీ సామాన్లు ఉన్నాయి.

మావారు కోపంతో ఊగి పోతున్నారు.

"ఏమిట్రా ఇది! ఇదా? ఇదా నువ్వు చేస్తున్న నిర్వాకం! ఆ రాజయ్యను చూడు! ఆ మాత్రం బుద్ధిలేకపోయింది నీకు! ఛా! మా కడుపున చెడపుట్టావు!"

ఒగరుస్తున్నారు ఆయన. శంకర్ ఒక్కసారి తల ఎత్తిచూపి తల దించుకున్నాడు. నాకు నోట మాట రావటంలేదు. రిటైరయి నప్పటినుండీ ఆయనకు ఏవిషయం లోనూ నిగ్రహం ఉండటం లేదు. ఆయనను వారించి ప్రయోజనం లేదు. నేను తెచ్చిన మినప సున్ని ఉండల్ని వాడి ముందు ఉంచాను.

"అమ్మా!" అన్నాడు వాడు గిరగిర కన్నీళ్ళు తిరుగుతుండగా

మమ్మల్ని చూసాక వాడు మాట్లాడి నది ఒక్కమాటే! నాకు బావురు మని ఏడవాలనిపించింది. కానీ అది ఏడవటానికి సమయం కాదు. నేను ధైర్యంగా ఉండాలి!

మావారి కోపం తగ్గటంలేదు. అది కోపమేనా? ఆవేదనా, ఆక్రోశమూ ఇంకా మరెన్నో అందులో కలిసిపోయి ఉన్నాయి. "ఎవడురా ఆ గూండా వెధవ? చివరకు గూండా వెధవలతో కలిసి తిరిగే వరకూ వచ్చిందన్నమాట నీ ప్రయోజకత్వం! ఆ పోలీసులు నిన్ను కూడా లాఠీలతో చావబాదినప్పుడు కాని...."

"ఏమండీ!" అని అరిచాను వినలేక. నా అరుపుతో తను అంటున్నదేమిటో తనకు తెలిసి వచ్చి వెలవెలాపోతూ ఆగిపోయారు. "ఛీ!" అంటూ ముఖం తిప్పుకున్నాడు.

శంకర్ ఆపదల్లో చిక్కుకుంటాడేమోనని నాకూ భయంగానే ఉంది.

"ఎందుకు నాయనా, ఆ గూండాలతో స్నేహాలు!" అన్నాను అనునయంగా....

"అమ్మా! ఆ గూండా ఎవరో తెలుసునా నీకు?"

"గూండాల గురించి నాకెలా తెలుస్తుంది?"

"నీకు తెలుసు! అతను కరుణాకర్!"

అదిరిపడ్డాను. కరుణాకర్ నాకు బాగా తెలుసు. బి. కాం. లో శంకర్ క్లాస్ మేట్! ఎప్పుడూ క్లాస్‌లో ఫస్ట్ వచ్చేవాడు. బి కాం. ఫస్ట్‌క్లాస్ వచ్చింది. యం. కాంలో గోల్డ్ మెడల్ కూడా సంపాదించుకున్నాడు.

"కరుణాకర్ గూండా అంటున్నావా? నేను నమ్మలేను."

"నిజానికి కరుణాకర్ గూండా కాడు. అదంతా రాజయ్యలాంటి వాళ్ళు కల్పిస్తున్న కథ. యం.కాం లో గోల్డ్ మెడల్ సంపాదించుకున్నా అతనికి ఉద్యోగం దొరకలేదు. విపరీతమైన తెలివిగలవాడు గదా! అతని ఆలోచనలు అతణ్ణి శాంతంగా నిలవనివ్వలేదు. తన ఈ దౌర్భాగ్యస్థితికి ఈనాటి ప్రభుత్వమే కారణమన్నాడు. బహిరంగంగా ఉపన్యాసాలు ప్రారంభించాడు. పోలీసుల దృష్టిలో పడ్డాడు. అంతే!"

నా మనసు బరువెక్కింది. నేనేం మాట్లాడలేకపోయాను. మావారి కళ్ళు కూడా చెమ్మగిల్లటం గమనించాను. శంకర్ ధైర్యం చేసి "అమ్మా! మీ బాధ చూడ

లేక నేను బాధపడుతున్నానే కాని నిజానికి నేనంతగా బాధపడటం లేదు. గౌరవంగా బ్రతకటానికి ఏ మార్గమయితేనేం?

"మా అబ్బాయి పచ్చి మిరప కాయ బజ్జీలు అమ్ముకుంటున్నాడు అని చెప్పుకోవటానికి మీరెందుకు సిగ్గుపడాలి? ఇందులో సిగ్గు పడ వలసినది ఏముందీ? దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ సమస్య క్షణా లలో తీరుతుందా? ప్రయత్నిస్తు న్నాను. అందాకా నాకు సాధ్య మయిన బ్రతుకు తెరువు చూసు కుంటున్నాను." అన్నాడు.

నేను వాడి మాటల్లోని మంచి చెడ్డలు ఆలోచిస్తూ కూచున్నాను.

"ఛ! ఊరుకో!" అన్నారు మావారు.

రెండు మూడు రోజులు యాంత్రికంగా గడిచి నేను ఈ కొత్త జీవితాని కలవాటు పడటానికి ప్రయత్నిస్తున్నాను. పచ్చి మిరప కాయ బజ్జీలు, వడలు నేనే తయారు చేస్తున్నాను. ఇదేగాక శంకర్ ఇంకా చాలా పనులు చేస్తు న్నాడని తరువాత నాకు తెలిసింది. మా వారు మాత్రం ఈ పరిస్థితికి తట్టుకోలేక మరింతగా ఉబ్బసం తెచ్చుకుని మంచ మెక్కేసారు. ఆయన కళ్లు అహర్నిశలూ రాజయ్య ఇంటివైపు అశాంతితో చూడటం నేనూ, శంకర్ గమ నించినా ఏం చెయ్యలేకపోయాం!

శంకర్ అమ్మకానికి వడలు చేస్తున్న నేను "లక్ష్మీ! లక్ష్మీ!" అని మా వారు కంగారుగా పిల వడంలో పొయ్యి మీద నుంచి మూకుడు దింపి వచ్చాను. "అలా చూడు!" అన్నారు? ఆయన ఎప్పుడూ చూసే రాజయ్య ఇంటి వైపు చూసాను. రాజయ్యను పోలీసులు పట్టుకుపోతున్నారు. ఎందుకూ? ఏం జరిగింది? వరాలు గోడుగోడున ఏడుస్తోంది. వెళ్ళి వరాలుని ఓదార్చాను. ఆ తర్వాత నెమ్మదిగా వివరాలు తెలిసాయి. రాజయ్య తానొక కంపెనీకి ప్రొప్రయిటర్ నని చెప్పుకుంటూ రకరకాల ఉద్యోగాలకు అభ్యర్థులు కావాలని ప్రకటనలు చేసేవాడు. అప్లికేషన్‌తో పాటు అప్లికేషన్ ఫీజ్ కూడా పంపాలనేవాడు. పాపం ఉద్యోగాలకోసం వెంపర్లాడే అనేక మంది ఫీజ్‌తో సహా అప్లికేషన్స్ పంపుకునేవారు. ఇక ఆ అప్లి కేషన్స్ గతి అంతే!

ఏ మోసమైనా ఎంతకాలం సాగుతుందీ? కొందరు జరుగు తున్నది పసికట్టి పోలీస్ రిపోర్టు ఇచ్చారు.

పోలీస్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు చేసి రాజయ్యను అరెస్టు చేశారు. అతని ఇంట ఉన్న సామానులన్నీ వాషింగ్ మిషన్, ప్రెషర్ కుక్కర్‌తో సహా స్వాధీనం చేసుకున్నారు.

ఈ విషయాలన్నీ విని గుండె బాదుకున్నారు మావారు. "ఛీ! ఛీ! వెధవ బ్రతుకు-" అని చీదరించుకున్నారు.

ఆరోజు శంకర్ వచ్చాక "శంకర్! ఆరోజు నిన్ను చీదరించుకున్నానురా! 'నా కడుపున చెడపుట్టావు' అన్నాను -సారీ, అయామ్ వెరీ సారీ! నిన్ను చూచుకుని గర్విస్తున్నాను. నిజమే! ఎందుకో మనం అనవసరంగా కొన్నికొన్ని పనులు చేస్తున్నాం అని చెప్పుకోవటానికి సిగ్గుపడుతున్నాం! బాధపడుతున్నాం! శుద్ధ దండుగ! 'ఆ రాజయ్యను చూసి సిగ్గు తెచ్చుకో!' అన్నానుకదూ! ఆ మాటలన్నందుకు సిగ్గుపడుతున్నానురా! ఒక్కనాటికీ నువ్వు ఆ రాజయ్యలా కాకూడదు. ఈ జన్మకు కాదు, కోటి జన్మలకుకూడా కాకూడదు-పడగ నీడలో విశ్రాంతి ఎక్కడ దొరుకుతుందిరా! వద్దు నాయనా! మనకా బ్రతుకొద్దు" అన్నారు-

ఇప్పుడు మేము ముగ్గురమూ కష్టపడుతున్నాం! మేం గొప్పగా బ్రతకలేక పోవచ్చు కాని అష్ట కష్టాలూ పడటంకాదు - శంకర్ ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాడు దొరకటం కష్టమే! కానీ చదివిన చదువు ఏమయిపోతుంది? కొంచెం ఆలస్యంగానయినా దొరకదా! సమస్యలన్నీ ఒక్క రాత్రిలో పరిష్కారంకావు. మాసమస్య ఏనాటికి పరిష్కార మౌతుందో! అన్నట్లు చెప్పడం మరిచాను-ఇప్పుడు మేం డిస్ట్రిక్ట్ బస్ స్టాప్ దగ్గర చిన్న హోటల్ నడుపుతున్నాం - శంకర్‌కేదో చిన్న గుమస్తా ఉద్యోగం వచ్చింది-

"ఛ! వెధవ ఉద్యోగం! ఎదుగు బొదుగు ఉండదు-అంతకంటె మన హోటలే బాగుంది, కొన్నాళ్ళకి పెద్దహోటల్‌గా మారుతుందేమో!" అన్నాడు శంకర్ తండ్రి ఏమంటారోనని భయపడుతూ!

నేనూ, మావారుకూడా ఒక్క మాటమీద శంకర్ నా చిన్న ఉద్యోగంలో చేరనియ్యలేదు మేం స్వతంత్రంగా హోటల్ నడుపుకుంటున్నాం. శంకర్ కనిపించిన ప్రతి ఉద్యోగానికి అప్లై చేస్తూనే ఉన్నాడు. ●